క్లుప్తంగా

షిర్డీసాయినాథునికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

శ్రీకాకుళం కల్చరల్: బొందిలిపురం సాయి దర్బార్‌లోని షిర్డీసాయినాథునికి గురువారం ప్రత్యేక పుజలు జరిగాయి. స్వామికి ఉదయం కాకాడ హారతి, వస్త్రాలంకరణసేవ, పుష్పాలంకరణ సేవ జరిగింది. పూజల్లో అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా తక్షణసాయం అందజేత



బీమా మొత్తం అందజేస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రణస్థలం: మండలంలోని వల్లభరావుపేట గ్రామానికి చెందిన దువ్వాన రమణ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఆ కుటుంబానికి వైఎస్సార్ బీమా తక్షణసాయం కింద రూ.10 వేలను ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ గురువారం అందజేశారు. వైఎస్సార్ బీమా పథకం ద్వారా రూ.5లక్షలు వర్తిస్తుందని తెలిపారు. వైఎస్సార్‌సీపీ మండల నాయకులు మహంతి పెద రామినాయుడు, చిల్ల వెంకటరెడ్డి, గురాన మానస, చిరంజీవి, కొత్తకోట పరిసినాయుడు, దువ్వాన లక్ష్మణరావు ఉన్నారు.

పేద రైతులకు న్యాయం చేయాలి



రైతులతో మాట్లాడుతున్న గంగరాపు సింహాచలం

ఎచ్చెర్ల క్యాంపస్: అర్హులకు ఎసైన్డ్ భూముల హక్కులు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గంగరాపు సింహాచలం అన్నారు. తమ్మినాయుడుపేటలో గురువారం రైతులను కలిశారు. ప్రభుత్వ నిబంధనలు మేరకు పేద రైతులకు న్యాయం చేయాలన్నారు. ఆక్రమణల్లో ఉన్న భూములకు సాగు హక్కు కల్పించటం వల్ల ప్రయోజనం ఉండదన్నారు. అర్హులకు మేలు జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. రాకోటి రాంబాబు, చిన్నారావు, రామారావు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు



వాండ్రంగిలోని ఎరువుల షాపును తనిఖీ చేస్తున్న అధికారులు

జి.సిగడాం: మండలంలోని వాండ్రంగి, పాలఖండ్యాం, జి.సిగడాం గ్రామాల్లో గల ఎరువుల దుకాణాలను వ్యవసాయశాఖ ఏడీఏ జగన్‌మోహన్‌రావు, మండల వ్యాసాయశాఖ అధికారి యర్రా శారద గురువారం తనిఖీ చేశారు. ఎరువుల నిల్వలు, రికార్డుల నిర్వహణ, స్టాక్ వివరాలను పరిశీలించారు. డీలర్లు, సిబ్బంది ఉన్నారు.

పశువులకు లంపీ స్కిన్ టీకాలు



కొత్తకోటలో పశువులకు లంపీ స్కిన్ టీకాలు చేస్తున్న వెటర్నరీ అసిస్టెంట్

లావేరు: మండలంలోని కొత్తకోట, అదపాక, గోవిందపురం, గుమడాం, లింగాలవలస, వెంకటాపురం, లావేరు తదితర గ్రామాల్లో గురువారం వెటర్నరీ అసిస్టెంట్‌లు, సిబ్బంది పశువులకు ఉచితంగా లంపీ స్కిన్ టీకాలు వేశారు. పశువులకు లంపీ స్కిన్ వ్యాధి రాకుండా ఉండటం కోసం పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఉచితంగా టీకాలు వేయడం జరుగుతుందన్నారు.

స్వామిత్ సర్వేపై శిక్షణ



శిక్షణకు హాజరైన సిబ్బంది

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని నైరా గ్రామ సచివాలయంలో గురువారం 38 మండలాలకు సంబంధించి స్వామిత్ సర్వేపై పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ నిర్వహించారు. భూ సర్వేకు సంబంధించిన పలు విషయాలను అధికారులు వివరించారు. స్థానిక సర్పంచ్ అరవల రామప్రతాప్, ఈవోపీఆర్డీలు, డీపీవోలు హాజరయ్యారు.

పరిశోధనల్లో భారత్ అగ్రగామి

- చంద్రయాన్–3 విజయోత్సవ ర్యాలీలో వక్తలు



గార: చంద్రయాన్ అక్షర ఆకృతిలో కొర్ని జెడ్పీ పాఠశాల విద్యార్థులు

శ్రీకాకుళం అర్బన్: చంద్రయాన్–3 విజయవంతం కావడం ద్వారా విశ్వానికి ఆదిగురువుగా భారత్ మారిందని, రోదసీ పరిశోధనల్లో ఇండియా అగ్రగామిలో నిలిచిందని శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ అన్నారు. శ్రీకాకుళం నగరంలో స్టార్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన చంద్రయాన్–3 విజయోత్సవ ర్యాలీని ఆమె ప్రారంభించారు. ఈ ర్యాలీ శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల నుంచి అంబేడ్కర్ జంక్షన్ వరకు సాగింది. ఇస్రో ప్రయోగం విజయవంతం చేసేందుకు నిరంతరం కృషి చేసిన శాస్త్రవేత్తలకు అభినందనలు తెలియజేస్తూ జై భారత్ జయ జయ భారత్ అంటూ నగర వీధుల్లో నినాదాలు చేశారు. కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు జి.ఇందిరాప్రసాద్, పీజీ గుప్తా, శాసపు జోగినాయుడు, బీవీ రవిశంకర్, గుడ్ల సత్యనారాయణ, సింహాద్రి వేణుగోపాల్, బి.దేవీప్రసాద్, ఎం.మల్లిబాబు,ఇండియన్ ఆర్మీ కాలింగ్ కేంద్రం సభ్యులు పాల్గొన్నారు.

గార: చంద్రయాన్–3 ప్రయోగం విజయవంతమైన సందర్భంగా కొర్ని జెడ్పీ పాఠశాల విద్యార్థులు చంద్రయాన్ అక్షర ఆకృతిలో కూర్చొని సందడి చేశారు. ఇస్రో సాంకేతిక బృందానికి శుభాకాంక్షలు అంటూ విజయ పతాకాలను ఎగురవేశారు. జాతీయ పతాకాలను చేతబూని జయహో భారత్ అంటూ నినాదాలు చేశారు. హెచ్ఎం వై.వాసుదేవరావు మాట్లాడుతూ.. చంద్రయాన్ విజయం స్ఫూర్తిదాయకమన్నారు. ఉపాధ్యాయులు ఎం.వి.నరసింగరావు, రవికుమార్, ఎస్.మురళీకృష్ణ, ఎస్.చంద్రభూషణరావు, వి.సురేష్‌కుమార్, ఆర్.సుధీర్, ఎస్.సుమలత, ఆర్.వాణి, ఆర్.శ్రీనివాసరావు, పీఈటీ ఎస్.వెంకటరమణ పాల్గొన్నారు.

శ్రీకాకుళం పాతబస్టాండ్: శాస్త్ర సాంకేతిక రంగాల్లో భారతదేశం అగ్రామిగా ఉందని.. ఈ విషయం చంద్రయాన్–3 విజయంతో మరోసారి రుజువైందని శ్రీకాకుళంలో జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎన్ని సూర్యారావు అన్నారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. చంద్రయాన్–3 వియవంతంపై సూర్యారావుతోపాటు ఆంధ్రప్రదేశ్ బీసీ న్యాయవాదుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆగూరి ఉమా మహేశ్వరరావు, చౌదరి లక్ష్మణరావు, సంఘ సభ్యుడు బి.వి.రమణ హర్షం వ్యక్తం చేశారు. ఇస్రో మరిన్ని విజయాలు సాధించాలని వారు ఆకాంక్షించారు.

ఇస్రో ఇండియా..



శ్రీకాకుళం అర్బన్: ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



జి.సిగడాం: కేజీబీవీలో విజయోత్సవం నిర్వహిస్తున్న విద్యార్థినులు

ఎచ్చెర్ల క్యాంపస్: అల్లినగరం ఉన్నత పాఠశాల విద్యార్థులు చంద్రయాన్ –3 విజయవంతమైన నేపథ్యంలో ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు. పాఠశాల ఆవరణలో గురువారం ఇస్రో ఇండియా అన్న అక్షర క్రమంలో విద్యార్థులు కూర్చున్నారు. జైహో భారత్, జైజై ఇస్రో అంటూ నినాదాలు చేశారు.

శాస్త్రవేత్తలకు సలామ్..

జి.సిగడాం: స్థానిక కస్తూర్బాగాంధీ విద్యాలయంలో అంతరిక్ష చరిత్రలో సరికొత్త రికార్డును సృష్టించిన భారత్ శాస్త్రవేత్తలకు సలామ్ చేస్తూ గురువారం విద్యాలయంలో విజయోత్సవాలు నిర్వహించారు. దేశం ఖ్యాతిని ప్రపంచ దేశాలకు తెలియజేసిన ఇస్రో శాస్త్రవేత్తలకు సలామ్ అంటూ ప్రదర్శించారు. ప్రత్యేకాధికారి ఉషారత్నకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఎచ్చెర్ల క్యాంపస్: ఇస్రో ఇండియా అక్షర ఆకృతిలో కూర్చున్న విద్యార్థులు



శ్రీకాకుళం అర్బన్: మాట్లాడుతున్న రాధాకృష్ణ

శాస్త్రవేత్తల కృషి అమోఘం

శ్రీకాకుళం అర్బన్: చంద్రుని దక్షిణ ధ్రువంపై చంద్రయాన్–3ను విజయవంతంగా దింపడంలో భారతదేశ శాస్త్రవేత్తల కృషి అమోఘమని ఫిజిక్స్ అధ్యాపకులు జి.రాధాకృష్ణ అన్నారు. శ్రీకాకుళంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థుల ఇండక్షన్ ప్రోగ్రాంలో భాగంగా గురువారం మిషన్ చంద్రయాన్–3 అనే అంశంపై అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.సూర్యచంద్రరావు, అకడమిక్ కో–ఆర్డినేటర్ సీహెచ్ కృష్ణారావు, వైస్ ప్రిన్సిపాల్ పి.శంకరనారాయణరావు, ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్ ఎస్.పద్మావతి, చరిత్ర అధ్యాపకులు ఎస్.చిన్నారావు పాల్గొన్నారు.

శ్రీకాకుళం: చంద్రయాన్–3 ప్రయోగ వీడియోలను పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో గురువారం ప్రదర్శించారు. దీనివల్ల ఉన్న ప్రయోజనాలను విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరించారు. బూరవకు చెందిన ప్రజ్ఞ అనే మహిళ చంద్రయాన్–3 విజయవంతానికి కృషిచేసిన శాస్త్రవేత్తలలో ఒకరుగా ఉండడం జిల్లా ప్రజలు గర్వించదగ్గ విషయమని ఉపాధ్యాయులు అన్నారు.

శ్రీకాకుళం అర్బన్: చంద్రయాన్–3ని విజయవంతంగా దింపి చరిత్ర సృష్టించిందని కాకినాడ ఆదిత్య విద్యాసంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. ఆదిత్య డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఎస్.వి.వేణుగోపాల్ , అకడమిక్ డైరెక్టర్ బి.ఇ.వి.ఎల్.నాయుడు, కార్యదర్శి సుగుణారెడ్డి ఉన్నారు. అలాగే బ్యాకర్స్ కాలనీలోని విశాఖ స్కూల్ ఆధ్వర్యంలో విజయోత్సవ సంబరాలు జరుపుకొన్నారు. ఆర్మీకాలింగ్ సౌజన్యంతో బ్యాంకర్స్ కాలనీ నుంచి రామలక్ష్మణ కూడలి, సూర్యమహల్ కూడలి వరకూ ర్యాలీ నిర్వహించారు. స్కూల్ చైర్మన్ కె.మధుసూదనరావు, ప్రధానోపాధ్యాయుడు పి.రామారావు ఉన్నారు.



చంద్రయాన్ ప్రయోగాన్ని వీక్షిస్తున్న ఏవీఎన్ఎం స్కూల్ విద్యార్థులు



శ్రీకాకుళం అర్బన్: కాకినాడ ఆదిత్య కళాశాల విద్యార్థుల ర్యాలీ



శ్రీకాకుళం అర్బన్: ర్యాలీ చేస్తున్న విశాఖ స్కూల్ విద్యార్థులు

ప్రజాసమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

- ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

జి.సిగడాం: గ్రామ స్థాయిలో ప్రజాసమస్యలు గుర్తించి వాటిని పరిష్కరించడమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని, దీని కోసం అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో గురువారం ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ నాలుగేళ్లలో విద్యుత్, సాగునీరు, తాగునీరు, విద్య, వైద్యం , భూ సర్వే, వ్యవసాయం, గృహనిర్మాణాలు, సచివాలయాలు, ఆర్‌బీకేలు, ఆరోగ్య కేంద్రాలు నిర్మాణం చేపట్టి దేశంలోనే నంబర్ వన్‌గా నిలిచామన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారని, సంక్షేమ పథకాలు లబ్ధిదారుల ఖాతాలకే జమ చేయడం జరుగుతుందన్నారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నామన్నారు.

పనులు వేగవంతం చేయాలి..

గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా మంజూరు చేసిన నిధులతో సంబంధిత అధికారులు పనులు వేగంతం చేయాలని ఆదేశించారు. పనులు చేసిన వాటికి తక్షణమే బిల్లులు మంజూరు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులపై ఆరా తీశారు.

విద్యుత్ శాఖ ఏఈఈ పనితీరు భేష్..

విద్యుత్‌శాఖ ఏఈఈ తిరుపతిరావు పనితీరుపై ఎమ్మెల్యే సంతృప్తి చెందారు. మండలంలో 13 వందల వ్యవసాయ పెంపు సెట్లతోపాటు వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఇటీవల సంతవురిటి గ్రామంలో పిడుగులు పడి మూడు ట్రాన్స్‌ఫార్మర్లు పేలిపోయాయన్నారు. 12 గంటల వ్యవధిలోనే ప్రజలకు విద్యుత్ ఇవ్వడంతో అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ, జేసీఎస్ కన్వీనర్ డోల వెంకటరమణ, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మక్క వెంకటిసాయి, వైస్ ఎంపీపీ తోలేటి వెంకటరావు, గృహనిర్మాణ శాఖ డీఈఈ కె.అప్పారావు, తహసీల్దార్ పప్పల వేణుగోపాలరావు, ఏఈఈలు బి.గోవిందరావు, మహాదాసుల రమేష్, బగాది భాగ్యలక్ష్మి, శ్రీవల్లి, ఏపీఎం రెడ్డి రామకృష్ణంనాయుడు, ఏపీఓ చోళ్ల సత్యనారాయణ, ఏఓ వై.శారద. వైద్యులు పొన్నాడ హరితాశ్రీ, అనుష, వైఎస్సార్‌సీపీ నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

సేవలతోనే గుర్తింపు

- ఏఎస్పీ విఠలేశ్వరరావు



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఏఎస్పీ విఠలేశ్వరరావు, పక్కనే జామి కిరణ్ తదితరులు

అరసవల్లి: సమాజంలో డబ్బులు సంపాదించే వాళ్లు ఎక్కువగానే ఉంటారని, అయితే అందులో కొందరే ఇతరులకు సేవలు చేయాలనే గొప్ప నిర్ణయాలు అమలు చేస్తుంటారని ఏఎస్పీ (క్రైం) టి.పి.విఠలేశ్వరరావు అన్నారు. సేవలతోనే గుర్తింపు సాధ్యమన్నారు. గురువారం బాలాజీ మెడికల్స్ వార్షికోత్సవంలో భాగంగా ప్రొప్రయిటర్ జామి కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఇలాంటి కార్యక్రమాలకు హాజరు కావడం ఎంతో సంతృప్తినిస్తాయన్నారు. దివ్యాంగులకు బాలాజీ మెడికల్స్ తరపున ట్రైసైకిల్‌ను అందజేశారు. కార్యక్రమంలో డ్రగ్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.చంద్రశేఖర్, ఇన్‌స్పెక్టర్ యుగంధర్, జామి కిరణ్‌కుమార్ కుటుంబసభ్యులు డోకి శ్రావణ్, కలివరపు సూర్యప్రకాష్, జిల్ ఫౌండేషన్, మదర్స్ లవ్ ఫౌండేషన్, సిక్కోలు స్వచ్ఛంద సేవాసమితి, శ్రీకాకుళం గ్రీన్‌సిటీ, చేయూత, మేమున్నాం, ప్రాణదాత సభ్యులు జి.దేవి కృపాల్, లైన్ బ్లడ్ బ్యాంక్ మేనేజర్ కె.సునీల్ పాల్గొన్నారు.

ఘనంగా తెలుగు భాషా వారోత్సవాలు



గిడుగు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు

పొందూరు: మండలంలోని గూనానపేట ప్రాథమిక పాఠశాలలో తెలుగు భాషా వారోత్సవాలను హెచ్ఎం గురుగుబెల్లి మధుబాబు ఘనంగా నిర్వహించారు. గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గిడుగు జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు. తెలుగు భాషకు ఆయన చేసిన సేవలను కొనియాడారు. విద్యార్థులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన



బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

రణస్థలం: విద్యార్థులు సత్వర సమాచారం అందించి బాల్య వివాహ రహిత సమాజానికి తమవంతు సహాయం చేయాలని కోష్ట గ్రామ సచివాలయ మహిళా పోలీస్ బమ్మిడి అమ్మోజి కోరారు. పల్లెపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు వివరించారు. బాలల హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించి మానవహారం ఏర్పాటు చేశారు. బాల్య వివాహ రహిత సమాజానికి కృషి చేస్తామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. చంద్రయాన్–3 విజయం పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఉపాధ్యాయులు, బ్రెడ్స్ సంస్థ సభ్యురాలు ఎల్.తేజశ్రీ, విద్యార్థులు పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు సత్కారం



ఉపాధ్యాయులను సన్మానించిన దృశ్యం

గార: విద్యార్థులను సన్మార్గంలో నడిపేది ఉపాధ్యాయులేనని మండల వైఎస్సార్‌సీపీ జేసీఎస్ ఇన్‌చార్జి కొయ్యాన నాగభూషణం అన్నారు. తూలుగు యూపీ పాఠశాలను నుంచి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పది మంది ఉపాధ్యాయులు ఒకేసారి బదిలీపై వెళ్లడం బాధకరమేనన్నారు. అయితే ప్రతి ఉద్యోగికి బదిలీ అనేది తప్పదన్నారు. ప్రధానోపాధ్యాయుడు ఆర్‌వీ రమణమూర్తి, జనార్దరావు, షేక్ నిషార్, జగన్నాధరావు, మీనాక్షి, మహేష్, పావని, అనిత, మాధవి, సోనియారాణిలను దుశ్శాలువలతో సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొయ్యాన సంధ్యారాణి, హెచ్ఎం సత్యారావు, ముకుందరావు, రామారావు, అప్పన్న, రమణ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

రణస్థలం: అగ్ని ప్రమాదాలు జరిగిన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన ఉండాలని రణస్థలం అగ్నిమాపక అధికారి పైలా అశోక్ తెలిపారు. మండలంలోని నెలివాడ ఆర్డర్ పాఠశాలలో అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన నివారణ అంశాలపై డెమో చేసి చూపించారు. అగ్ని ప్రమాదాల నివారణ పరికరాల వినియోగం గూర్చి ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలన్నారు. ఇంట్లో నిత్యం వినియోగించే గ్యాస్ సిలిండర్‌కు మంటలు వ్యాపించినప్పుడు ఎలా రక్షించాలో, నివారణ చర్యలు ఎలా చేపట్టాలో చేసి చూపించారు. ప్రిన్సిపాల్ జి.అరుణ, అగ్నిమాపక సిబ్బంది బలగ ప్రసాద్, ఎస్.రామకృష్ణ, కె.రాంబాబు, జి.రామలక్ష్మణ, గంగరాజు, రవికుమార్, వెంకటరావు పాల్గొన్నారు.

26న జిల్లాకు గరీబ్ గైడ్ కమిటీ రాక

జలుమూరు: ఈ నెల 26వ తేదీన జిల్లాకు గరీబ్ గైడ్ కమిటీ సభ్యులు పర్యటించనున్నారని సుప్రీంకోర్టు న్యాయవాది డి.వి.రావు గురువారం తెలిపారు. కోర్టు ధిక్కరణ కేసులు.. జలుమూరు మండలం చిన్నదూగాం పంచాయతీ పరిధి కాకర్ల చెరువు, నరసన్నపేట మండలం రాజుల చెరువు తదితర కేసులు తుది దశకు చేరుకోవడంతో కోర్టుకు వాస్తవాలు తెలియచేసేందుకు గరీబ్ గైడ్ కమిటీ ఐదుగురుని నియమించిందన్నారు. ఈ కమిటీకి అధ్యక్షుడిగా తనను (డి.వి.రావు) ఎన్నుకుందన్నారు. జిల్లాలో ప్రభుత్వ స్థలాలు, చెరువుల ఆక్రమణలు తమ దృష్టికి తేవాలనుకుంటున్నవారు, ఉచిత న్యాయ సహాయం కావాలనుకుంటున్నవారు ఈ నెల 26న మధ్యాహ్నం మూడు నుంచి ఐదు వరకు ఫోన్ 9618536666, 91804 56789 నంబర్లను సంప్రదించాలని కోరారు.